ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

## పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -62 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం 21 జూన్ 2026

# రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు

## చిలకలూరిపేట లో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం

**ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం**

**రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది**

**48 గంటల్లో ధాన్యం కొనుగోలు మొత్తాన్ని జమచేస్తున్నాం**

**రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలి**

**ఆంధ్రాను మించి తెలంగాణ ధాన్యం పండిస్తోంది**

**వైకాపా హయాంలో రైతులు నానా కష్టాలు పడ్డారు**

**లింగగుట్లో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల**

**రైతులకు అండగా ఉంటామని ప్రకటించిన చంద్రబాబు**



**పల్నాడు,జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**

రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. దాన్ని నిలబెట్టుకున్నా మని సీఎం చంద్రబాబు అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను విడుదల చేసిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిధుల విడుదలకు సంబంధించి రైతులు తమ ఫోన్ ద్వారా వచ్చాయో లేదో చూసి చెప్పాలన్నారు. **మిగతా 2లో...**

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్



**యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్**

**ఉండవల్ల గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ**

**బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు**

**చంద్రబాబు విజినరీ నేత అన్న బాబా రాందేవ్**

**అమరావతి,జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**

: దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా ప్రక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. **మిగతా 2లో...**



# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

**రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని**

**ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ**

**అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన**

**భువనేశ్వర్,జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**

ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో **మిగతా 2లో...**

# రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కులాల దరిద్రం పోవాలి

## కాకినాడలో 'మన ఊరు - మాట మంతి' లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**నేరస్థుడికి కులం, మతం ఉండవు**

**క్రిమినల్స్ చేతికి అధికారం వస్తే ?**

**ప్రజల భవిష్యత్తు మంటగలుస్తుంది**

**శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు**

**నేరం చేసినవాళ్ళను కుల కోణంలో చూడొద్దు**

**తప్పు చేస్తే మిమ్మల్ని ఏ పార్టీ రక్షించలేదు**

**జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**

'సమాజంలో నేరస్థులను కేవలం క్రిమినల్స్ గా మాత్రమే చూడాలని, వారికి కులాల చాటున చూడకూడదు' అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. **మిగతా 2లో...**




# నేడు నీట్ రీ-ఎగ్జామ్

## నిర్వహణకు సర్వం సిద్ధం

**దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది దరఖాస్తు**

**రాష్ట్రంలో 199 పరీక్షా కేంద్రాలు, 73,084 మంది విద్యార్థులు**




**హైదరాబాద్‌జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**

వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ (యూజీ)-2026 రీ-ఎగ్జామ్ ఆదివారం జరగనుంది. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేసిన గత పరీక్షకు బదులుగా జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఈ రీ-ఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష కోసం నమోదు చేసుకున్నారు. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో 5,432 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. **మిగతా 2లో...**

# 'మెట్రో' పై కిషన్ రెడ్డికి రేవంత్ మరో లేఖాస్త్రం

**రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి**

**అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి**

**జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్‌జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను **మిగతా 2లో...**



# కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

**: తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి**

**కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం**

**బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి**

**కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ**

**హైదరాబాద్‌జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**

తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం **మిగతా 2లో...**




# హార్ముజ్ మళ్లీ క్లోజ్

**ఇరాన్ కీలక నిర్ణయం**

**లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడుల ఎఫెక్ట్**

**అమెరికా తన హామీలను నెరవేర్చే వరకు చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండదని వెల్లడి**



**టెహ్రాన్ : జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**

ప్రపంచ ఇంధన సరఫరాకు కీలక మార్గమమైన హార్ముజ్ జలసంధి మళ్లీ మూత పడింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులు ఆపకపోవడంతో హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ **మిగతా 2లో...**

# రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు

మొదటిపేజీ తరువాయి

అక్కడే రైతులు సెలఫోన్లు ఊపుతూ వచ్చాయని సైగలు చేశారు. టెక్నాలజీ పెరగడంతో క్షణాల్లో వ్యవహారం తెలిసిపోతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టినందుకు తాము నమ్మకంగా పనిచేస్తున్నామని అన్నారు. వైకాపా హయాంలో అన్నదాతలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలను కష్టాల్లోకి నెట్టడం తప్ప గొడ్డలి పార్టీకి మరేమీ తెలియదని విమర్శించారు. ఇవాళ యోగా, స్వచ్ఛాంధ్ర, అన్నదాత సుఖీభవ.. ఇలా మూడు మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నా జీవితంలో ఇవాళ్టికి మించిన ఆనందం మరొకటి లేదన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించింది. విధ్వంసం నుంచి వికాసంవైపు తీసుకెళ్తామని మేం హామీ ఇచ్చాం. సంపద సృష్టించి.. రైతుల కష్టాలు తీరుస్తామని చెప్పాం. అన్నదాతలకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం. బటన్ నొక్కగానే 99.8 శాతం మంది రైతులకు నిధులు



జమయ్యాయి. గతంలో ధాన్యం కొని ఆరు నెలలైనా డబ్బులు వచ్చేవి కావు. మా ప్రభుత్వం 48 గంటల్లోనే డబ్బులు ఇస్తోందన్నారు. ఒకప్పుడు ఆంధ్ర అంటే వరి.. తెలంగాణ అంటే మెట్ట పొలాలు. ఇప్పుడు ఆంధ్రాను డామినేట్ చేసి తెలంగాణ వరిని పండిస్తోంది. మనం ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి. ఎక్కువ రసాయనాలు వినియోగిస్తే.. ఇతర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం అని చంద్రబాబు అన్నారు. 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున రూ.3,125 కోట్లు జమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పాల్గొన్న పీఎం- కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి ముఖ్యమంత్రి వర్చువల్‌గా వీక్షించారు. లింగంగుంట్లలో ప్రజావేదిక సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు, వర్మీకంపోస్ట్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని



అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

# రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కులాల దరిద్రం పోవాలి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే ఆంధ్రప్రదేశ్ కు కులాల దరిద్రం వదిలిపోవాలన్నారు. తప్పు చేసిన వాడికి, నేరాలకు పాల్పడేవారికి ఎలాంటి కులం, మతం ఉండవని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అటువంటి నీచమైన శక్తులను ఏ ఒక్కరూ సమర్థించకూడదని చెప్పారు. క్రిమినల్ గ్యాంగ్‌ల సహాయంతో ప్రభుత్వాలను నడపాలని చూడటం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకోవాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. క్రిమినల్స్ అధికారంలోకి వస్తే ప్రజల భవిష్యత్తు మంటగలుస్తుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని, శాంతికి విఘాతం కలిగిస్తూ, తప్పులకు పాల్పడే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కులాలు, మతాల పరంగా వాట్సాప్ గ్రూపులు ఉన్నట్లే... లా అండ్ ఆర్డర్ కోసం, స్థానిక సమస్య కోసం వాట్సాప్ గ్రూపులు ఉండాలని, ఆ దిశగా ప్రజలు ఆలోచించాలని అన్నారు. శనివారం రాత్రి కాకినాడలో మన ఊరు మాట మంతి కార్యక్రమంలో ప్రసంగించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "నేరపూరిత నేపథ్యం ఉన్న వ్యక్తులు రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవులను అధిష్టించి, ప్రజల జీవితాలను శాసించాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే గొడ్డలిపెట్టు. అటువంటి శక్తులపై నిరంతరం తిరగబడటానికి, న్యాయం కోసం పోరాడటానికి సిద్ధంగా ఉంటాను. వచ్చే ఎన్నికల్లో గెలుస్తానో లేదో తెలియదు కానీ ప్రజల కోసం నిరంతరం పోరాడతాను. c అంబేద్కర్ గారిపై గౌరవం ఉంటే తప్పుడు కేసులు పెట్టరు

**కులానికి పరిమితం చేయకండి**




నేను కులాలను దాటి దేశం వైపు వెళ్దామంటే నా దురదృష్టం నన్ను తిరిగి కుల చట్రంలోకి తీసుకువస్తారు. దేశాన్ని ప్రేమించే వాడు, అందరూ బాగుండాలని కోరుకునేవాడిని. వ్యవస్థలు బాగుండాలని కోరుకునే నన్ను కుల చట్రంలోకి పట్టుకువస్తారు. అయితే నన్ను బంధించలేరన్న విషయాన్ని వారు గుర్తు పెట్టుకోవాలి. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎక్కడ శాంతి భద్రతలకు విఘాతం కలిగినా మీ గళం బలంగా వినిపించండి.

**అలా సమర్థించేవాళ్ళతో ప్రమాదం**

పాపం చిన్న వయసులో 23 నేరాలు చేశాడు, పాపం పసి వయసులో బీరు బాటిల్ తీసుకుని గొంతు కోసేశాడు, తెలిసి తెలియని పసి వయసు అని సమర్థించే వ్యక్తులను ప్రోత్సహిస్తే రాష్ట్ర భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుంది. అలా సమర్థించేవారితో ప్రమాదం. ఇదే పెద్ద మనిషి నిర్భయ కేసులో తెలంగాణ పోలీసుల చర్యను సమర్థించాడు. ఇక్కడకు వచ్చేసరికి కులం అంటూ మాట్లాడుతున్నాడు. హోమ్ శాఖ మంత్రి గారిని సైతం అతని పార్టీ వాళ్ళు వ్యాఖ్యానిస్తున్నారు. ఆమె మేకప్ గురించి మాట్లాడుతున్నారు. ఇది అక్కడితో ఆగదు. ఇంటిలో మన ఆడబిడ్డలు ఫేస్ పౌడర్ కూడా రాసుకోకూడదా? రేపు ఏదో కాలేజీలో కుర్రాళ్ళు ఆడబిడ్డలను గురించి ఇదే విధంగా కామెంట్స్ చేస్తే... అప్పుడు పరిస్థితి ఏమిటి?నేను బాధ్యతలు తీసుకున్నాక కాకినాడలో ఎవరు ఎస్పీగా ఉండాలి ఎవరు కలెక్టర్ గా ఉండాలి అనే ఆలోచన చెయ్యలేదు. ఒక్కటే సూచన ఇచ్చాను ప్రజాస్వామ్యం బలంగా ఉండాలి, వ్యవస్థ బలంగా ఉండాలి. ఇది తప్పా నా దగ్గర నుండి మీకు ఎలాంటి ఫోన్లు రావు. నా పార్టీ వారు అయినా నేను ప్రోత్సహించను. ఎందుకంటే నేను వ్యవస్థలను బలపరచడానికి ఉన్నాను, బలహీనపరచడానికి కాదు" అన్నారు.

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

మొదటిపేజీ తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్దా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# నేడు నీట్ రీ-ఎగ్జామ్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ నుంచి 73,084 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొత్తం 199 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్-అండ్-పేపర్ విధానంలో జరుగుతుంది. బయోమెట్రిక్ ధృవీకరణ, బహుళస్థాయి తనిఖీలు, కేంద్రాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలననీ, నిషేధిత వస్తువులను తీసుకురావద్దని పరీక్ష నిర్వహణా సంస్థ ఎన్‌టీఏ హెచ్చరించింది. డ్రస్ కోడ్, ప్రవేశ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ కీలు, ప్రత్యేక సేవల పేరుతో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అభ్యర్థులకు సూచించిం ది. అధికారిక సమాచారం కోసం ఎన్‌టీఏ వెబ్‌సైట్, ధృవీకరించిన వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపింది. పరీక్ష నిర్వహణకు ముందు దేశవ్యాప్తంగా శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించి కేంద్రాల సన్నద్ధతను పరిశీలించి నట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

# హార్ముజ్ మళ్లీ క్లోజ్

మొదటిపేజీ తరువాయి

ఈ దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించింది. అమెరికా తన బాధ్యతల నుంచి తప్పుకోవడాన్ని నిరసిస్తూ ఇరాన్ ఉమ్మడి సైనిక కమాండ్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయిల్ దాడులు, అమెరికా నమ్మకద్రోహానికి ఇది మొదటి అడుగేనని, దాడులు ఆగకపోతే తదుపరి కఠిన చర్యలు ఉంటాయని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు స్విట్జర్లాండ్‌కు తమ దౌత్య బృందాన్ని పంపుతున్నట్టు ప్రకటిస్తూనే అమెరికా తన హామీలను నెరవేర్చే వరకు చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండబోదని టెహ్రాన్ తేల్చి చెప్పింది. సైనిక హెచ్చరికల తర్వాత ఇరాన్ తన దౌత్య వ్యూహాన్ని కూడా మార్చింది. గత శుక్రవారమే జరగాల్సి ఉండి రద్దయిన స్విట్జర్లాం డ్‌లో శాంతి చర్చల కోసం తమ ప్రతినిధి బృందం బయలుదేరినట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే ఈ పర్యటన కేవలం అమెరికాను నిలదీయడానికేనని స్పష్టం చేసింది. లెబనాన్‌లో యుద్ధం ఆపడం సహా కీలక హామీలను అమెరికా నెరవేరిస్తేనే తుది ఒప్పందంపై చర్చలు ముందుకు సాగుతాయని తెలిపింది. ఈ అవగాహన ఒప్పందంలో ఏ ఒక్క నిబంధన ఉల్లంఘించినా, మొత్తం శాంతి ప్రక్రియే ప్రమాదంలో పడుతుందని ఇరాన్ హెచ్చరించింది.

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ లెబనాన్‌లో ఇజ్రాయిల్ తరచూ దాడులు జరపడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ కారణంతోనే ఇరాన్ హార్ముజ్ జలసంధి మూసివేత కఠిన నిర్ణయాన్ని తీసుకుంది. వాస్తవానికి అమెరికా- ఇరాన్ ఒప్పందంలో ఇటు ఇజ్రాయిల్ గానీ, అటు హిజ్బుల్లా గానీ భాగస్వాములు కావు. తాము హిజ్బుల్లాను పూర్తిగా నిర్మూలించే వరకు దక్షిణ లెబనాన్ నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ దాడుల వల్ల స్విట్జర్లాండ్‌లో అమెరికా, ఇరాన్, ఖతార్ దౌత్యవేత్తల మధ్య జరగాల్సిన ఉన్నత స్థాయి చర్చలు మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తున్నాయి. కాగా తాజా పరిణామాల నేపథ్యంలో ఇంధన ధరలకు మళ్లీ రెక్కలు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే వచ్చే వారం వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య జరగబోయే అమెరికా మధ్యవర్తిత్వ చర్చలైనా ఈ సంక్షోభానికి తెరదించుతాయో లేదో చూడాలని విశ్లేషకులు చెప్తున్నారు.

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

మొదటిపేజీ తరువాయి

నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

## 'మెట్రో' పై కిషన్ రెడ్డికి రేవంత్ మరో లేఖాస్త్రం

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్‌ఎఫ్‌సీ (ఐఆర్‌ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

**రూ. 2,000 చొప్పన 18,880 కోట్లు జమ**

**హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ**



**కోల్‌కతా,జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.** పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# వేంపెంట శ్రీ రామాలయ పునర్ ప్రతిష్ట మహోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు

**:- డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు**



**పాములపాడు జూన్ 20 రిపబ్లిక్ న్యూస్:-**పాములపాడు మండలంలోనీ, మా వేంపెంట గ్రామంలో పునర్నిర్మిత ఆలయంలో శ్రీ సీతారామ హనుమత్ సమేత ధ్వజ శిఖర ప్రతిష్టా మహోత్సవము అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు విలేకరుల సమావేశంలో తెలియజేశారు.ఈ సందర్భంగా అంతర్జాతీయ సమాజ సేవకుడు & వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు మాట్లాడుతూ నాకు తెలిసి, నేను పుట్టినప్పటి నుంచి ఇలాంటి మహోత్సవాన్ని ఎన్నడూ చూడలేదనీ అన్నారు. మా పూర్వీకులు నిర్మించిన శ్రీరామాలయాన్ని తిరిగి పునరుద్ధరించి, మహోత్సవాలతో పునఃప్రారంభించడం,నేను పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాననీ అన్నారు. సుమారు 98 సంవత్సరాల క్రితం మా పూర్వీకులు భక్తి, శ్రద్ధలతో నిర్మించిన ఈ పవిత్ర దేవాలయంలో, నేడు భగవంతుని అనుగ్రహంతో మా అమ్మ శ్రీ కేశవ రామచంద్ర ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ టేకూరి.రామ సుబ్బమ్మ (భర్త స్వర్గీయ టేకూరి.కృష్ణుడు) ఆధ్వర్యంలో పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని జరుపుకోవడం మాకు పునర్జన్మ సఫలమైనంత ఆనందాన్ని కలిగిస్తోందనీ అన్నారు.31-03-2019న పునాదులు వేసిన ఈ శ్రీరామాలయం, ఎన్నో ఆటంకాలు, ఎన్నో సవాళ్లను అధిగమించి నేడు మహోత్సవ వైభవంతో నిలవడం భగవంతుని కృపకు నిదర్శనం అని అన్నారు. విశేషంగా, జూన్-17వ తేదీ మా నాన్న టేకూరి.కృష్ణుడు పరమపదించిన రోజు కావడం, అదే తేదీన ఆయన ఎన్నో ఆశలు పెట్టుకున్న ఈ దేవాలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమం పూర్తవడం మాకు ఎంతో భావోద్వేగభరితమైన అనుభూతిని కలిగించిందనీ, ఇది యాదృచ్ఛికం కాదు, శ్రీరాముని సంకల్పమే అని మేము విశ్వసిస్తున్నామనీ అన్నారు.2026, జూన్-15, 16,17వ తేదీలు మా గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ మూడు రోజుల పాటు నిర్వహించిన అన్ని కార్యక్రమాలు అత్యంత ఘనంగా, భక్తి భావంతో గొప్పగా జరిగాయన్నారు. యాగాలు, హోమాలు, వివిధ పూజా కార్యక్రమాలు, చెక్క భజన, బాహుబలి హనుమాన్ శోభాయాత్ర, గ్రామోత్సవం, సంగీత విభావరి (ఆర్కెస్ట్రా) మరియు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయనీ. గ్రామ ప్రజల ఐకమత్యం, భక్తి, సేవా భావం అన్ని కలగలసి ఈ మహోత్సవాన్ని మరింత వైభవోపేతంగా నిలబెట్టాయన్నారు.

ఈ సందర్భంగా ఆడపిల్లలు మా వేంపెంట గ్రామానికి వచ్చి వడిబియ్యం పోసుకోవడం, ప్రతి ఇల్లు ఆడపిల్లలతో, బంధువులతో ఊరంతా కోలాహలంగా కళకళలాడటం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయి, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిండిపోయిందన్నారు.

ఈ దేవాలయం కోసం ఎంతో శ్రమించి, తన జీవితంలో ఒక లక్ష్యంగా భావించిన మా నాన్న కృష్ణుడు స్మృతికి ఈ మహోత్సవం ఒక శాశ్వత నివాళిగా నిలిచిపోతుందన్నారు.

ఈ మహోత్సవం విజయవంతం కావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన గ్రామ పెద్దలు, దాతలు, భక్తులు, యువత, మహిళలు మరియు సేవకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. మీ అందరి సహకారం, సమర్పణ భావం మరియు భక్తి వల్లే ఈ మహోత్సవం ఘనవిజయం సాధించిందనీ అన్నారు.

అలాగే, ఏవైనా కారణాల వల్ల ఈ మహోత్సవం నిర్వహణకు ఆటంకం కలగాలని లేదా ఆపాలని ప్రయత్నించిన వారిని కూడా భగవంతుడు సద్బుద్ధితో అనుగ్రహించి, వారి తప్పులను క్షమించాలని ప్రార్థిస్తున్నాను.ఈ దేవాలయ పునర్ ప్రతిష్టా కార్యక్రమానికి వచ్చిన వారందరికీ శ్రీ సీతారామచంద్ర స్వామి, ఆంజనేయ స్వామివారి దివ్య ఆశీస్సులు మీ అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ, మరోసారి ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాననీ అన్నారు.

# బ్రాహ్మణపల్లి గ్రామంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పూర్తి - గ్రామసభ నిర్వహణ



**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 20(రిపబ్లిక్ న్యూస్)**

ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే విజయవంతంగా పూర్తిచేయబడింది. సర్వే అనంతరం గ్రామసభ నిర్వహించి, గ్రామ ప్రజలకు సర్వే వివరాలు తెలియజేసి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సేకరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందే విధంగా సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ ఓర్వకల్లు మండల అధ్యక్షులు దుగ్గపాటి నాగిరెడ్డి, డీ ఎల్ డీ ఓ అశ్విని కుమార్ గారు, స్పెషల్ ఆఫీసర్ వి. సుధీర్, పంచాయతీ కార్యదర్శి జయ పరిమళ పాల్గొన్నారు.అలాగే గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నన్నూరులో గ్రామసభ నిర్వహణ..

## పీఎంఏవై గృహాలు, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై అవగాహన



**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 20(రిపబ్లిక్ న్యూస్)**

ఆఫ్టర్నూన్ శనివారం రోజు పిఎంఏవై గ్రామిన్ 2.0 ఆవాస్ +హౌసింగ్ సంబంధించి గ్రామ సభను ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామపంచాయతీ యందు నిర్వహించడం జరిగినది అక్కడ లబ్ధిదారులతో ఇల్లు కట్టుకొనడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుండి రెండు లక్షల 39000 అమౌంట్ రిలీజ్ అవుతుందని గ్రామసభలో చర్చించడం జరిగినది, అలాగే యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు సంబంధించి వ్యాలిడేషన్ ఫిర్యాదులు 24వ తేదీ వరకు స్వీకరించబడతాయని తెలియపరచడం జరిగినది, అలాగే రేపు ఇంటర్నేషనల్ యోగ డే జరుపుకోవాలని ప్రజలకు తెలియజేయడం జరిగింది డిస్టిక్ డిపిఆర్సి కోఆర్డినేటర్ మంజుల వాణి ఇంటింటికి వెళ్లి చెత్తను వేరు చేసి పొడి చెత్తను స్వచ్ఛరథం కు తడి చెత్తను చెత్త బండికి అప్పజెప్పాలని ఇంటి వద్దనే తడి చెత్తను పొడి చెత్తను వేరు వేరు చేసి చేయాలని వన్ బ్యాగ్ వన్వన్ బిన్ ప్రజలకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించడం జరిగినది ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బసిరుంబి హరిత రాయబారులు మరియు డిప్యూటీ ఎంపీడీవో కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజీలో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

## భవనాలపై చెత్త తొలగింపు పరిసరాల పరిశుభ్రత పర్ల ఆర్‌హెచ్‌టీసీలో మొక్కల నాటకం







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 20)**

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజీలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి కళాశాల భవనాల పైభాగాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాలపై ఉన్న వాటర్ ఔట్‌లెట్లను శుభ్రం చేసి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే కళాశాల పరిసరాల్లో ఉన్న అపరిశుభ్ర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు అనంతరం విద్యార్థులతో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రి అయిన పర్ల గ్రామంలోని ఆర్‌హెచ్‌టీసీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ పచ్చని మొక్కలే పర్యావరణ పరిరక్షణకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డా. హరిచరణ్, డా. సింధియా శుభప్రద, పర్ల ఆర్‌హెచ్‌టీసీ మెడికల్ ఆఫీసర్ డా. శైలజ, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా. అరుణ, డా. రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. రవి నాయక్, డా. నాగరాజు, డా. వైష్ణవి, డా. ప్రసన్న రాణి, లెక్చరర్లు సురేష్ కుమార్, భవాని ప్రసాద్, సరిత, ఇంజనీర్ రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు, సూపర్‌వైజర్ మాధవరాజు తదితరులు పాల్గొన్నారు

# రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ తొలి విడత నిధులు జమ

**:-వ్యవసాయ అధికారి బి. ఉషారాణి**



**దేవనకొండ, జూన్ 20( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**

దేవనకొండ మండల కేంద్రంలో శనివారం "అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్" పథకాల తొలి విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి బి. ఉషారాణి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పథకాల వివరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి అర్హ రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.దేవనకొండ మండలంలో తొలి విడత కింద 15,220 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.7.61 కోట్లు జమ కానున్నట్లు వెల్లడించారు. అలాగే పీఎం కిసాన్ పథకం కింద 12,063 మంది రైతులకు రూ.2.41 కోట్లు అందనున్నట్లు తెలిపారు.ఈ రెండు పథకాల ద్వారా మొత్తం రూ.10.02 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ కానుండటం మండల రైతాంగానికి పెద్ద ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు.రైతులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు. నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుందని చెప్పారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆకుల విరేష్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ రవికుమార్, వీరయ్య, టీడీపీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, రాజాసాబ్, మురళి తదితరులు పాల్గొన్నారు.అలాగే వ్యవసాయ విస్తరణ అధికారులు మల్లికార్జున, అబ్దుల్ సలాం, గ్రామ వ్యవసాయ సహాయకులు కళావతి, హసీనాతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

# నీట్ పునఃపరీక్ష నిర్వహణకు కర్నూలులో భారీ భద్రతా బందోబస్తు

**16 కేంద్రాల్లో 4,995 మంది అభ్యర్థులు..**

**ప్రశ్నాపత్రాల రవాణాకు సీఆర్పీఎఫ్ ఎస్కార్ట్..**

**అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు**





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 20)**

జిల్లాలో జరగనున్న నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష నిర్వహణకు పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో బందోబస్తు విధులకు నియమితులైన పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4,995 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేక నిఘా, భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ప్రశ్నాపత్రాల రవాణా సమయంలో కర్నూలు పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ సిబ్బందితో ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా పోలీసు సిబ్బంది సహకరించాలని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అభ్యర్థులను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఫ్రిస్కింగ్ నిర్వహించిన తరువాత మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్లు, బ్లూటూత్ పరికరాలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు.

పరీక్ష పూర్తయ్యే వరకు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్ష సమయం వరకు మూసివేయాలని సూచించారు.

విద్యార్థుల సౌకర్యార్థం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీ రాఘవేంద్రతో పాటు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వకర్మలకు శుభవార్త:14 నియోజకవర్గాల్లో "విశ్వకర్మ మినీ ఇండస్ట్రియల్ పార్క్"లకు ప్రభుత్వం అంగీకారం

**కర్నూలులో డీఐసీ అధికారులతో సమావేశం**

**- సోమవారం సాయంత్రమే తుది గడువు**

**కర్నూలు ప్రతినిధి, జూన్ 20(రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్, ఆంధ్రప్రదేశ్ శాఖ చేసిన కృషికి ఫలితంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో "విశ్వకర్మ మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

శనివారం రోజునకర్నూలు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సి. అశోక్ కుమార్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.బి.వి. డేనియల్ ప్రభుత్వ ఆదేశాల మేరకు అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్, ఆంధ్రప్రదేశ్ శాఖ కర్నూలు కార్యాలయానికి విచ్చేసి, సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మశ్రీ దేవపూజ ధనుంజయ్య ఆచారి, జిల్లా అధ్యక్షులు బ్రహ్మశ్రీ కమ్మరి తిమ్మయ్య ఆచారి, ఉపాధ్యక్షులు బ్రహ్మశ్రీ కే. చంద్రశేఖరాచారి, రాష్ట్ర నాయకులు బ్రహ్మశ్రీ శరభయ్య ఆచారి, శిల్పాచార్యులు బ్రహ్మశ్రీ దేవపూజ అనంతాచారి, బ్రహ్మశ్రీ దురగడ్డ జక్కనాచారి, బ్రహ్మశ్రీ వాసు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వం అంగీకరించిన నియోజకవర్గాలు**

కర్నూలు జిల్లా:కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు.

నంద్యాల జిల్లా: పాణ్యం, నందికొట్కూరు, బనగానపల్లె, నంద్యాల, శ్రీశైలం, ఆళ్లగడ్డ, డోన్.విశ్వకర్మ-విశ్వబ్రాహ్మణుల కులవృత్తులైన లికమ్మరం, వడ్రంగం, కంచరం, శిల్పం, స్వర్ణకారంపరిశ్రమలు స్థాపించదలచిన వారికి వారి యూనిట్లకు సరిపడా భూమిని ప్రభుత్వ రేటు ప్రకారం కేటాయించడంతో పాటు, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కూడా కల్పిస్తామని అధికారులు ఈ సమావేశంలో స్పష్టంగా హామీ ఇచ్చారు.అత్యవసరం - 48 గంటలే గడువు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోదలచిన కులవృత్తిదారులు తాము స్థాపించదలచిన పరిశ్రమ వివరాలు, కావలసిన భూమి విస్తీర్ణంతో సహా తమ పేర్లను సోమవారం, 22-06-2026 సాయంత్రం 5గంటలలోపుకర్నూలు జిల్లా అధ్యక్షులు బ్రహ్మశ్రీ కమ్మరి తిమ్మయ్య ఆచారి సెల్: 94909 31864,కి ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని రాష్ట్ర అధ్యక్షులు కోరారు.






ప్రభుత్వం తలుపులు తెరిచింది. మనం అడుగు ముందుకు వేయాలి. ఇది మన జాతి భవిష్యత్తును మార్చే అవకాశం. సమయం వృధా చేయవద్దు,అని బ్రహ్మశ్రీ దేవపూజ ధనుంజయ్య ఆచారి పిలుపునిచ్చారు.

జారీ చేసిన వారు,బ్రహ్మశ్రీ దేవపూజ ధనుంజయ్య ఆచారి రాష్ట్ర అధ్యక్షులు

అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్, ఆంధ్రప్రదేశ్ శాఖ సెల్: 70133 52858

## వైకుంఠం జ్యోతి కి జన్మదిన శుభాకాంక్షలు

### చిప్పగిరి మాజీ సర్పంచ్ సి.గోవిందన్న



**చిప్పగిరి, జూన్, 20, (రిపబ్లిక్ న్యూస్)**
ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతిని చిప్పగిరి మాజీ సర్పంచ్ సి. గోవిందన్న కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆలూరులోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతిని,రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ దంపతులను మాజీ సర్పంచ్ గోవిందన్న మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతోను,గజమాలతో సన్మానించారు.వైకుంఠం జ్యోతి మున్ముందు మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని అష్ట ఆయుఆరోగ్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని దేవుళ్లను వేడుకుంటున్నట్లు గోవిందన్న విలేకరులకు తెలిపారు.ఈయన వెంట డీలర్ రామయ్య, కాకర్ల సురేంద్ర తదితరులు ఉన్నారు.

## వైభవంగా వైకుంఠం జ్యోతి జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం



**చిప్పగిరి, జూన్, 20,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు శనివారం ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పై సేవా దృక్పథం ఉన్న మహా వ్యక్తి వైకుంఠం జ్యోతి అని కొనియాడారు, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసే వ్యక్తి వైకుంఠం జ్యోతి అని తెలిపారు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం మాట్లాడుతూ వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్ ఆలూరు అభివృద్ధి కోసం నిత్యం శ్రమిస్తున్నారని తెలిపారు, ఈ కార్యక్రమంలో నంచర్ల శివలింగ ,తిమ్మప్ప, నేమకల్ సన్నప్ప, సంఘాల చంద్ర, బెల్డోన వెంకటేశ్వర్లు, చిప్పగిరి అశోక్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజనాల బండ పై సత్య ప్రమాణాల జోరు



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 20 రిపబ్లిక్ న్యూస్**
సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ పై శనివారం ప్రమాణాల జోరు కనిపించింది. పలమనేరు మదనపల్లి కుప్పం ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు పలువురు అనుమానితులు ప్రమాణాలు చేశారు. మరికొందరు వాయిదా వేసుకుని వెళ్లారు సత్య బండపై కొలువుతీరిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్ర పాలకుడు అయిన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయాన్నే ప్రధానచకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు ముఖ్యంగా వివిధ రకాల జలాలతో అభిషేకము నిర్వహించారు. భక్తులకు టిటిడి ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగం జరిగింది ఈ కార్యక్రమంలో భక్తులు కక్షిదారులు టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 20( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
రబి సీజన్ కు ధాన్యం సేకరణ రికార్డు స్థాయిలో కొనుగోలు జరుగుతుందని గత సీజన్ లో ఈ రోజుతో పోలిస్తే ఈ రబీ సీజన్లో ఈ రోజు వరకు 01 లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసి అతివేగంగా రైతుల ఎకౌంట్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ
జిల్లాలో యాసంగి సీజన్ వడ్ల సేకరణ కోసం మొత్తం 533 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారుమెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, గతంలో కంటే కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో రైతులకు వేగంగా చెల్లింపులు జరిగాయనీ, తెలిపారు.జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు ముగింపు దశలో ఉన్నాయని జిల్లాలో అన్నీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించటం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రబీ 2024-25సీజన్లో 3,20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు వేగంగా చెల్లింపులు జరిగాయని తెలిపారు.. 2026 -2027 సంవత్సరం రబీ సీజన్లో 20-6-2026 వ తేదీ నాటికి జిల్లాలో 4,18,244.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 892.62 కోట్ల రూపాయలు 86,130 రైతులకు మంది రైతులకు లబ్ధి చేకూరింది అన్నారు గత సీజన్ తో పోలిస్తే ఈ రబీ సీజన్లో(01) లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామని తెలిపారు.ధాన్యం కొనుగోలు ముగింపు దశలో ఉన్నాయని రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. కలెక్టర్ స్పష్టం చేశారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే నగర పరిశుభ్రత సాధ్యం

### స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ డా. ఏ. సిరి పిలుపు -వీధుల్లో చెత్త వేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరిక

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 20)**
నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించిన కలెక్టర్, అనంతరం ఉద్యోగులు, ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నాలుగు వారాలుగా "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. అయితే పరిశుభ్రత అనేది ఒక్కరోజు లేదా ఒక్క కార్యక్రమంతో పరిమితం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అన్నారు. నగరంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి, హానికర, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి మున్సిపల్ వాహనాలకు మాత్రమే అప్పగించాలని ప్రజలకు సూచించారు.పర్యావరణానికి హాని కలిగించే చర్యలను నియంత్రించేందుకు కలెక్టర్లకు జరిమానాలు విధించే అధికారాలు ఉన్నాయని పేర్కొన్న ఆమె, ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయడం, అపరిశుభ్రతకు కారణమవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు





తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుద్ధ్యంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు.
నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గత నాలుగు వారాలుగా ప్రతి శనివారం ప్రత్యేక అంశాలతో నగరవ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రధాన రహదారులు, కూడళ్ళు, రెడ్‌యెల్లో స్పాట్ల శుభ్రత, కాలువలు, డ్రైన్లు, వీధుల పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణపై అవగాహన కార్యక్రమాలు, మార్కెట్లు మరియు వాణిజ్య ప్రాంతాల శుభ్రత పనులు చేపట్టినట్లు వివరించారు.
చివరి వారంలో ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రతతో పాటు చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను పూర్తిగా శుభ్రం చేసినట్లు ఆయన తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం, నగరపాలక సంస్థ, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషికి ప్రజలు తోడ్పాటును అందించాలని కమిషనర్ కోరారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, స్వచ్ఛ సర్వేక్షణ్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, జయకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైకి మర్యాదపూర్వక స్వాగతం



**అందోల్ జూన్ 20( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అందోల్ మండలంలోని జోగిపేట పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై గిరి శ్రీకాంత్‌ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, బీర్ల శంకర్, ఖాజా పాషా, ఆకుల శంకర్, దాసరి దుర్గయ్య, కరుణాకర్, రమణ, రఫీక్, గోపాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని నాయకులు నూతన ఎస్సైకి సూచించగా, ప్రజల సహకారంతో విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఎస్సై గిరి శ్రీకాంత్ తెలిపారు

## అందోల్‌లో నేడు టీవైజేఎఫ్ ఐడీకార్డ్ మరియు హెల్త్ కార్డుల పంపిణీ




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 20( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అందోల్ నియోజకవర్గంలో తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఐడీ కార్డులు మరియు హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం నేడు నిర్వహించనున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జితేందర్ రావు తనుగుల ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.ఈ కార్యక్రమంలో అందోల్ నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులు, టీవైజేఎఫ్ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత మరియు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ హెల్త్ కార్డులు, గుర్తింపు కార్డులను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి టీవైజేఎఫ్ కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు..

# అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కింద జిల్లాలో రైతులకు రూ.180.15 కోట్ల లబ్ధి

### 2.72 లక్షల మంది రైతుల ఖాతాల్లో తొలి విడత సాయం జమ

### -ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పీఎండీఎస్, బహుళ పంటల సాగు, ప్రకృతి వ్యవసాయంపై కలెక్టర్ డా. ఏ. సిరి పిలుపు





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 20)**
రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ పథకాల కింద జిల్లాలో అర్హులైన 2,72,757 మంది రైతులకు రూ.180.15 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. శనివారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ 2026-27 తొలి విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశమున్నందున రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు పంటల ఎంపిక, సాగు విధానాలపై అవగాహన కల్పిస్తారని, వారి సూచనలను పాటించాలని కోరారు. "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో రైతులు చురుకుగా పాల్గొని నిపుణుల సలహాలను వినియోగించుకోవాలన్నారు.
ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాకు నిర్దేశించిన 92 వేల ఎకరాల లక్ష్యంలో ఇప్పటికే 70 వేల ఎకరాల్లో కార్యక్రమాన్ని పూర్తి చేశామని, అందులో 60 వేల ఎకరాల్లో విజయవంతంగా మొలకలు వచ్చినట్లు తెలిపారు. ఈ విధానంతో రైతులు అదనంగా రూ.30 వేల వరకు ఆదాయం పొందిన ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు.
రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా బహుళ పంటల సాగు చేపట్టాలని, తద్వారా ఆదాయం పెరగడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. ఏటీఎం మోడల్, ఏ-గ్రేడ్ మోడల్ వంటి బహుళ పంటల సాగు విధానాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయంలో పండిన పంటలు ఎక్కువకాలం నాణ్యతను నిలుపుకుంటాయని, భవిష్యత్ తరాలకు





ఆరోగ్యకరమైన ఆహారం, స్వచ్ఛమైన నీరు, సారవంతమైన భూమిని అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.
వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందిస్తున్న కందులు, వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంతో పాటు పశు పోషణను అనుబంధ వృత్తిగా స్వీకరించాలని, జిల్లాలో 10 వేల పశువుల పంపిణీ లక్ష్యానికి ఇప్పటికే 12 వేల దరఖాస్తులను బ్యాంకులకు పంపించినట్లు తెలిపారు.
గోరకల్లు, అలగనూరు రిజర్వాయర్ల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని, పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. అలాగే కందులు, జొన్నలు, మొక్కజొన్న వంటి పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ రైతులకు భరోసా కల్పిస్తోందన్నారు.
అనంతరం అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ తొలి విడత నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గానికి చెందిన 32,978 మంది రైతులకు రూ.22.06 కోట్ల చెక్కును కలెక్టర్ డా. ఏ. సిరి, ఎమ్మెల్యే గౌరు చరిత అందజేశారు.
కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యానవన శాఖ అధికారి రాజాకృష్ణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రమణ, నీటి సంఘం అధ్యక్షుడు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బి ఎల్ ఓ ల తో కలిసి ఎన్యూమారేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న సిద్దేశ్వర రావు.



**రైల్వే కోడూరు జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**
నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్-ఎస్ఆర్లు కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జోరుగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ ఆకుల సిద్ధేశ్వరరావు కొత్త మంగంపేట గ్రామంలోని యూత్ 154, 155 పోలింగ్ కేంద్రాల పరిధిలో గల ఓటర్లకు బీఎల్ఓలు, బీఎల్సీలతో కలిసి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. అంతేకాకుండా గోవిందం పల్లి ఓబులవారిపల్లి కాకళ్లవారిపల్లి బోటు మీద పల్లి పరిసర గ్రామాలలో ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు ఉంటే తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్ఐ మల్లికార్జునరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, బీఎల్ఎలు, పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్

ఆదివారం 21 జూన్ 2026

# క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ గుత్తి జట్టు విజేత







**అనంతపురం/ గుత్తి జూన్ 20 : (రిపబ్లిక్ న్యూస్):** గుత్తి పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ రైల్వే ఇన్స్టిట్యూట్‌లో కెపిఎస్ గ్రూప్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఫైనల్ మ్యాచ్‌లో గుత్తి జట్టు, కళ్యాణదుర్గం జట్లు తలపడగా గుత్తి జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. కళ్యాణదుర్గం జట్టు రన్నరప్‌గా నిలిచింది. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా తనయుడు వెంకటేశ్వర్లు తేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత, రన్నరప్ జట్ల క్రీడాకారులకు ట్రోఫీలు, బహుమతులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు తేజ మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రోత్సాహం అందించడం ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు.

టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన కెపిఎస్ గ్రూప్ ఇండస్ట్రీస్ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రవిచంద్ర, నవీన్, కోచ్ మగి, క్రీడాకారులు, నిర్వాహకులు, క్రీడాభిమానులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం

### ఘనంగా గుత్తి కోటలో యోగ కార్యక్రమం

### జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్







**అనంతపురం/ గుత్తి జూన్ 20 :(రిపబ్లిక్ న్యూస్ ):**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం చారిత్రాత్మక గుత్తి కోట యోగా సందడితో కళకళలాడింది. కోటలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యోగా వేదికపై అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్‌కు గుత్తి కోట వద్ద రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, టూరిజం రీజినల్ డైరెక్టర్ ఓబులమ్మ, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, తహసీల్దార్ పుణ్యవతి, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్, గేట్స్ కళాశాల డైరెక్టర్ పద్మావతి తదితరులు ఘన స్వాగతం పలికారు.

కోటలోని గుర్రపుశాల సమీపంలో ఏర్పాటు చేసిన యోగా ప్రాంగణంలో జిల్లా ఆయుష్ యోగ మాస్టర్లు లాల్య నాయక్, కృష్ణయ్య, రామకృష్ణల ఆధ్వర్యంలో యోగాభ్యాసాలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యోగాసనాల్లో పాల్గొని ఆరోగ్య చైతన్యాన్ని చాటారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ యోగా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలో ఆరోగ్య అవగాహన పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, డీఈ హేమచంద్ర, ఏఈ గోవిందప్ప, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఎంఈఓ రవి నాయక్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# స్కూల్‌లో అగ్నిమాపక శాఖ అవగాహన కార్యక్రమం

### అగ్ని ప్రమాదాలు, వరదలలో అప్రమత్తతే ప్రాణరక్షణ

### ఏడీఎఫ్ఓ కేపీ లింగమయ్య





**అనంతపురం క్రైమ్, జూన్ 20,(రిపబ్లిక్ న్యూస్ ):** ప్రమాదాల సమయంలో అప్రమత్తతే ప్రాణాలను కాపాడుతుందని జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి (ఏడీఎఫ్ఓ) కేపీ లింగమయ్య అన్నారు. స్థానిక రూరల్ మండల పరిధిలోని ఆలమూరు రోడ్డులో ఉన్న గుడ్ చిల్డ్రన్ స్కూల్‌లో జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయాందోళనలకు గురికాకుండా ఎలా స్పందించాలి, మంటల్లో చిక్కుకున్న వారిని ఏ విధంగా సురక్షితంగా బయటకు తీసుకురావాలి, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి, వరదల సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలు ఏవి అనే అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శనలతో వివరించారు. ఇటీవల నిర్వహించిన అగ్నిమాపక శాఖ వారోత్సవాలు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో విజయవంతంగా జరిగాయని, ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించడమే శాఖ ప్రధాన లక్ష్యమని ఏడీఎఫ్ఓ లింగమయ్య పేర్కొన్నారు.

చిన్న వయస్సులోనే విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందితే ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన చెప్పారు. పాఠశాలల్లో అగ్నిమాపక శాఖ సూచించిన భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తామని గుడ్ చిల్డ్రన్ స్కూల్ కరస్పాండెంట్ సాయి సాగర్ తెలిపారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు మాత్రమే కాకుండా సమాజానికి కూడా ఎంతో ఉపయోగకరమని విద్యార్థులు, సిబ్బంది అభిప్రాయపడ్డారు. భద్రతా సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో అగ్నిమాపక శాఖ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా అనర్థాలను నివారించవచ్చని అధికారులు సూచించారు.


# సర్ కార్యక్రమం పై సమీక్ష సమావేశంలో పాల్గొన్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి



**రైల్వే కోడూరు జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణ పరిధిలోని స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నందు తాసిల్దార్ ఆకుల సిద్దేశ్వర రావు ఆధ్వర్యంలో సర్ కార్యక్రమంపై ఈ ఆర్ వో ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైసిపి పార్టీ తరఫున రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులుతల్లెం భరత్ కుమార్ రెడ్డి,వైసీపీ పట్టణ కన్వీనర్ సి హెచ్ రమేష్ బాబు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గం లో రెండు లక్షల 3000 ఓట్లు ఉన్నాయని, 252 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రవాసుల ఓట్లు 18500 ఉన్నాయని తెలియజేస్తూ, ఇతర జిల్లాలు, ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి జీవనోపాధి కొరకు ఇక్కడ ఎక్కువ అరటి బొప్పాయి సాగు నిమిత్తం ఇక్కడ జీవన ఉపాధి కోసం వచ్చినటువంటి స్థిర నివాసం ఉన్నటువంటి ఇతర ప్రాంతాలవారు చాలామంది ఉన్నారని వారి మ్యాపింగ్ వల ప్రాంతంలో ఉండడం వల్ల చాలా ఇబ్బందికి గురవుతున్న పరిస్థితి ఏర్పడిందని వారి ఇష్టం మేరకు స్థిర నివాసం ఉన్నచోట ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని, అంతేకాకుండా మంగంపేట ప్రాంతంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు గత 24 సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఉండే వారికి ఓటు హక్కు ఉంది. వాళ్ళ అందరికీ 2002 సం. లో మ్యాపింగ్ చేయలేదు. మ్యాపింగ్ చేసి ఓటు హక్కు ఇక్కడ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా విభజనలో భాగంగా మార్చే ప్రక్రియలో ఈ ఆర్ ఓ ద్వారా పార్టీల నాయకులకు ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని తెలియజేస్తూ, ఏమనేషన్ పత్రాలు ప్రతి ఒక్క ఓటరుకు చేరే విధంగా కృషి చేయాలని, అంతేకాకుండా ఇతర ఊర్లలో పెళ్లి చేసుకుని రైల్వేకోడూరు నియోజకవర్గంలో నివాసం ఉంటున్న కొత్తవారికి సంబంధించిన పత్రాలను మీ ద్వారానే సరఫరా చేయాలని కోరారు. అంతే కాకుండా ప్రవాసాంధ్ర వాసులకు ఓటు హక్కు కోసం ఫారం 6గా పత్రాలను బిఎల్ఏ బిఎల్ఓ ల ద్వారా పంపిణీ చేయాలని కోరారు. సర్ కార్యక్రమంలో భాగంగా బిఎల్ఏ బిఎల్ఓ లకుఈ ఆర్వో ద్వారా స్పష్టమైన ఆదేశాలు దిశా నిర్దేశం చేసి ఓటరుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి మారే సుకుమార్, వార్డు మెంబర్ శంకరయ్య, శ్రీను మరియు ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల విడుదల

## -రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం








**అనంతపురం/గుత్తి, జూన్ 20: (రిపబ్లిక్ న్యూస్ )** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ పథకం రెండో ఏడాది నిధుల విడుదల కార్యక్రమం శనివారం గుత్తి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, గుమ్మనూరు ఈశ్వర్ రైతుల ఖాతాల్లో నిధులను జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయరాం, వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు.

వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతులకు పెట్టుబడి సాయం, సాగునీటి వసతులు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల బీమా వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. అన్నదాత సుఖీభవ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం రైతులకు సాగు ఖర్చుల భారం తగ్గించడంతో పాటు పంటల సాగుపై మరింత నమ్మకాన్ని పెంచుతోందన్నారు.

రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతు కుటుంబాల ఖాతాల్లో మొత్తం రూ. 3,125.47 కోట్లు జమ కానున్నాయని తెలిపారు. ఇందులో 45,69,817 మంది భూయజమాని రైతులు, 1,16,021 మంది అటవీ భూములు సాగు చేస్తున్న రైతులు లబ్ధి పొందనున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన "సూపర్ సిక్స్" హామీలను అమలు చేస్తూ, ఒక్క ఏడాదిలోనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వాటాలతో కలిపి రూ. 8,985.41 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో రైతు సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా అమలవుతున్నాయని తెలిపారు.

### టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివ యాదవ్, టీడీపీ నాయకురాలు పత్తి హిమబిందు పాల్గొన్నారు. ప్రజా దర్బార్‌కు హాజరైన ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను నాయకులు స్వీకరించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవడానికే ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అర్జీని పరిశీలించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్తి హిమబిందు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్,ఎంపీడీవో ప్రభాకర్ నాయక్, అగ్రికల్చర్ ఏడిఏ వెంకట రాముడు, వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, మండల అధ్యక్షుడు లక్ష్మీ రంగయ్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు, రమేష్, రాజా, ఆయికట్టు చైర్మన్ కేశవ నాయుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి, మాజీ సర్పంచ్ రామలింగమయ్య,గుత్తి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు లో ఏపీ వెలుగు వివోఏ ఆనిమేటర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక.






**రైల్వే కోడూరు జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.** తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు,ఎన్జీవో హోం లో శనివారం మధ్యాహ్నం, ఏపీ వెలుగు వివో ఏ సమావేశం నగిరిపాటి ఆనంద్, అధ్యక్షతన జరిగింది. రైల్వే కోడూరు మండలం నూతన వివో ఏ, అధ్యక్షులుగా, గంగాదేవి, కార్యదర్శిగా పి సోని, కోశాధికారి కే జ్యోతి, ఉపాధ్యక్షులు మునిరత్నమ్మ, లక్ష్మీ ప్రసన్న, సునీత,మండల సహాయ కార్యదర్శి రేవతి, సుభాషిని లను ఏకగ్రీవంగా మండల కమిటీ ఎన్నుకున్నట్లు, సిఐటియు, మండల కార్యదర్శి. పి జాను ప్రసాద్. ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్, మాట్లాడుతూ. నాలుగు నెలలు వివోఏ లకు జీతాలు చెల్లించాలని, డిమాండ్ చేశారు. జీతాల సక్రంగా చెల్లించుకుంటే, ఎలా పని చేయాలని ప్రశ్నించారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని, కోరారు. హెచ్ఆర్ పాలసీ, గ్రూప్ ఇన్సూరెన్స్ 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రజా రిపబ్లిక్



# విజయోత్సవ కాదు .. నయవంచన సభ

**చివరకు కలెక్టర్‌ను టీడీపీ కార్యకర్తలా మార్చేశారు**
**నిరుద్యోగ భృతి ... ఆడబిడ్డ నిధి ఎక్కడ?**
**రెండేళ్లలో 6 లక్షల పింఛన్లు కోత**
**రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఏదీ**
**ఇసుక, మద్యం దందా చేస్తున్నందుకు విజయోత్సవ సభలా**
**గాడితప్పి టీడీపీ కార్యాలయాలుగా పోలీస్‌స్టేషన్లు**
**డీఎస్సీపై సీబీఐ దర్యాప్తుతో వాస్తవాలు వెలుగులోకి**
**వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి**

**అనంతపురం అర్బన్, జూన్ 20,(రిపబ్లిక్ న్యూస్ ):**
ఎన్నికలకు ముందు కూటమిగా ఏర్పడిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చాయి. అధికారంలోకి వచ్చాక హామీల అమలులో విఫలం అయ్యారు. ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో అనంతపురంలో విజయోత్సవం పేరుతో సభ నిర్వహించారు. అది విజయోత్సవ సభ కాదు.. నయవంచన సభ" అని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తరఫున కూటమి పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సభలో చివరకు జిల్లా కలెక్టర్‌ను కూడా టీడీపీ కార్యకర్తగా మార్చేశారని అన్నారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి రెండేళ్ల పాలనా వైఫల్యాలను ఆయన వివరించారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రంలో 66 లక్షల మంది పింఛన్ అందుకునే వారని గుర్తు చేశారు. రెండేళ్లుగా ఒక్క కొత్త పింఛన్ ఇవ్వకపోగా ఏకంగా 6 లక్షల పింఛన్లు తొలగించినందుకు విజయోత్సవ సభ నిర్వహించారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడ చూసినా మట్టి మాఫియా, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోందని, అందుకోసమే కూటమి నేతలు విజయోత్సవ సభ నిర్వహించారా? అని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో పేర్కొన్న నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేల భృతి ఎక్కడ? ఆడబిడ్డ నిధి కింద మహిళలకు ప్రతి నెలా ఇస్తామన్న రూ.1500 ఏదీ? అని నిలదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా కింద ఏటా రూ.13500 అందించామన్నారు. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అన్నదాత సుఖీభవగా మార్చిందని చెప్పారు. ఎన్నికల సమయంలో కేంద్రంతో సంబంధం లేకుండా ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక కేంద్రంతో ముడిపెట్టారని.. పైగా తొలి ఏడాది ఒక్క రైతుకు కూడా అన్నదాత సుఖీభవ అందించలేదని చెప్పారు. రెండో ఏడాదిలో లబ్ధిదారుల్లో కోత పెట్టారని మండిపడ్డారు. వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. రెండేళ్ల కాలంలో ఉన్న పథకాలను కూడా తొలగించారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగాలంటే డబ్బులిచ్చుకునే పరిస్థితి వచ్చిందన్నారు.

**విజయోత్సవ సభ కూటమి నేతల ఆత్మస్తుతికే పరిమితం**

పోలీస్‌స్టేషన్లు టీడీపీ కార్యాలయాలుగా మారిపోయాయని విమర్శించారు. రాజధాని పేరుతో అమరావతిలో ఆర్గనైజ్డ్‌గా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. వెనుకబడిన రాయలసీమకు కూటమి పాలనలో ప్రత్యేక నిధులేవీ రాలేదన్నారు. హంద్రీనీవాకు సంబంధించి వైఎస్ జగన్ హయాంలో ఆరు పంపులు నడుస్తుంటే ఇప్పుడు 12 పంపులు ఆడించి 51 టీఎంసీలు తీసుకొచ్చామని విజయోత్సవ సభలో చెప్పడాన్ని అనంత ఆక్షేపించారు. నిజంగా 12 పంపులు ఆడితే 51 టీఎంసీలు రావడానికి 240 రోజులు పడుతుందా? అని సూటిగా ప్రశ్నించారు. హంద్రీనీవా తొలి దశ కాలువ వెడల్పు అనుకున్న స్థాయిలో చేయలేదని, రెండో దశ లైనింగ్ పనుల్లో అవినీతి కారణంగా నాణ్యత లేకుండాపోయిందన్నారు. విజయోత్సవ సభ కూటమి నేతల ఆత్మస్తుతికే పరిమితం అయ్యిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులను కూడా కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్ అధికారంలో ఉన్న సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే.. చంద్రబాబు మాత్రం ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే ఆర్టీసీకి చెందిన విలువైన



ఆస్తులనూ అమ్మకానికి పెడుతున్నారని విమర్శించారు.

**డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే కారుమూరి సునీల్ అరెస్ట్**

డైవర్షన్ పాటిటిక్స్‌లో భాగంగానే మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. డీఎస్సీ కుంభకోణం, విజయవాడలో సాయికృష్ణ లాకప్ డెత్, క్రాంతికుమార్ ఆత్మహత్య ఘటనలను డైవర్ట్ చేయడానికి ప్రభుత్వం సునీల్‌ను అరెస్ట్ చేసిందన్నారు. ఈ అరెస్ట్‌ను ఖండిస్తున్నామని తెలిపారు. కూటమి పాలనలో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడితప్పిందన్నారు.

**ఒకే నోటిఫికేషన్.. 1.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు**

కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ నియామకాలను అక్రమాలకు నిలయంగా మార్చారని అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఒకే నోటిఫికేషన్‌తో సచివాలయాల్లో 1.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, ఎక్కడా ఒక్క ఆరోపణ రాలేదన్నారు. కానీ 16 వేల పోస్టులతో చేపట్టిన డీఎస్సీలో అవకతవకలు జరిగాయన్నారు. మెరిట్ లిస్ట్ ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాలపై సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. వాస్తవానిని వైఎస్ జగన్ హయాంలోనే 6 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని, కానీ టీడీపీ నాయకులు న్యాయస్థానాలకు వెళ్లి అడ్డంకులు సృష్టించారన్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనా విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందించలేని పరిస్థితిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నారని విమర్శించారు.

**జిల్లా రైతాంగానికి మీరేం చేశారు?**

అనంతపురం జిల్లా రైతాంగానికి కూటమి ప్రభుత్వంలో జరిగిన మంచి ఏంటని అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. చివరకు విత్తనాలు, ఎరువులు కూడా అందించలేని పరిస్థితి ఉందన్నారు. రెండేళ్లుగా ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వలేకపోయారన్నారు. గత ఏడాది జిల్లాలో ఎరువులు పక్కదారి పట్టాయని..దీనిపై విచారణ చేయించినా నివేదిక ఎందుకు బయట పెట్టలేదన్నారు. చివరకు కలెక్టర్ కూడా బదిలీపై వెళ్లిపోయారని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 'యాప్' కష్టాలు ఎదురవుతున్నాయని, చాలా మంది రైతులకు యాప్ ఎలా వినియోగించాలో కూడా తెలియదన్నారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్నా పట్టించుకునే వాళ్లు లేరని విమర్శించారు.


**చంద్రబాబు, లోకేష్‌ను జయరాం ఏమన్నారో తెలీదా?**

వైసీపీ వెన్నుపోటు పార్టీ అంటూ గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నించగా.. ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి మంత్రిగా పని చేసి చివరకు పార్టీ మారిన జయరామే వైసీపీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయారన్నారు. గతంలో చంద్రబాబు, నారా లోకేష్‌లను ఉద్దేశించి గుమ్మనూరు జయరాం ఎలాంటి వ్యాఖ్యలు చేశారో అందరికీ తెలుసని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లిక్కర్ దందా జరుగుతోందని, విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు ఏర్పాటయ్యాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి విజయోత్సవ సభ పెట్టుకోవడం హాస్యాస్పదని వ్యాఖ్యానించారు. సమావేశంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, సాంస్కృతిక విభాగం నగర అధ్యక్షుడు కేశవరెడ్డి, యువజన విభాగం నగర ప్రధాన కార్యదర్శి మసూద్, సోషల్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయతీ పరుడిపై నిందలా

**ఈఎన్‌సీపై దుష్ప్రచారాన్ని ఖండించిన ఇంజినీర్లు**
**చర్చలతోనే సమస్యల పరిష్కారం: అసోసియేషన్**
**రిటైర్డ్ డిప్లొమా ఇంజినీర్ల పాల్గొనడంపై అసంతృప్తి**
**ఈఎన్‌సీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే సహించం**
**బెదిరింపులకు భయపడబోమని స్పష్టం**

**అనంతపురం అర్బన్,జూన్ 20,(రిపబ్లిక్ న్యూస్ ):**
పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్ (ఈ. ఎన్.సీ) బాలూ నాయక్ నీతి, నిజాయతీ, నిబద్ధతకు మారుపేరని, అటువంటి మచ్చలేని వ్యక్తిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం డిప్లొమా ఇంజినీర్లకు తగదని ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ అనంతపురం జిల్లా ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు అనంతపురంలోని పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయం–1లో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షురాలు జింకల కృష్ణజ్యోతి, జనరల్ సెక్రటరీ గోపాల్ నాయక్, సభ్యులు బీబీఎన్ ప్రసాద్, లక్ష్మీదేవి, పద్మావతి, సంగీత విలేకర్లతో మాట్లాడారు. ఒక గిరిజన కుటుంబంలో పుట్టిన బాలూ నాయక్ అంచెలంచెలుగా ఎదిగి ఈ.ఎన్.సీ స్థాయికి ఎదిగినా.. ఏమాత్రం అహంకారం గానీ, ఒకరికి అన్యాయం చేయాలనే ఉద్దేశం లేని వ్యక్తిగా పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖలో పని



చేసే కింది స్థాయి ఉద్యోగి మొదలుకొని ప్రతి ఒక్కరినీ ఎంతో ఆప్యాయంగా పలుకరిస్తారని, ప్రతి ఉద్యోగి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తారని, అటువంటి వ్యక్తిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఏకంగా ఈ.ఎన్.సీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించిన డిప్లొమా ఇంజినీర్లు కేవలం తమ ఉనికి కోసమే ఆరాటపడ్డారనే విషయం అర్థమవుతోందన్నారు. ఈ.ఎన్.సీని బెదిరించే ధోరణిలో నిందారోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. అవసరమైతే తాము కూడా రంగంలోకి దిగి, ధీటుగా సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ.ఎన్.సీగా బాలూ నాయక్ బాధ్యతలు చేపట్టాక.. ఎంతో మందికి ఉద్యోగోన్నతి కల్పించారని, పూర్తి పారదర్శకంగా.. సజావుగా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించి, గత, ప్రస్తుత ప్రభుత్వాల పెద్దల మన్ననలు పొందారని గుర్తు చేశారు.

**బ్లాక్ మెయిల్ కోసం ధర్నాలకు దిగితే బెదిరేది ఉండదు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1:3 నిష్పత్తిలో గ్రాడ్యుయేషన్ ఇంజినీర్లకు, డిప్లొమా ఇంజినీర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని స్పష్టంగా ఉందన్నారు. ఆ విధంగా అందరికీ న్యాయం చేసేందుకు ఈ.ఎన్.సీ కృషి చేస్తుండగా, డిప్లొమా ఇంజినీర్లు బ్లాక్ మెయిల్ కోసం ధర్నాలకు దిగితే బెదిరిపోయేది ఉండదన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని, అవసరమైతే తాము కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. ఏదేని సమస్య ఉంటే సామరస్యపూర్వంగా చర్చించుకొని పరిష్కరించుకోవాల్సింది పోయి, అడ్డదారుల్లో అందలం ఎక్కేందుకు ఏకంగా ధర్నాలకు దిగితే తాము కూడా తగ్గేదే లేదన్నారు. బీటెక్, ఎంటెక్ వంటి ఉన్నత చదువులు చదివి, ఏపీపీఎస్సీ ద్వారా 1997వ సంవత్సరంలో రిక్రూట్ అయిన తాము ఇప్పటికీ ఏఈఈలుగానే కొనసాగుతున్నామని తెలిపారు. ఇన్నేళ్ల సర్వీసులో తాము ఒక్కసారి కూడా ప్రమోషన్ కు నోచుకోలేదన్నారు. తమ ప్రాంత జోనల్ స్థాయిలో కనీసం 70 దాకా డీఈఈ పోస్టులు ఖాళీ ఉన్నట్లు వివరించారు. వాటిని 1:3 నిష్పత్తిలో భర్తీ చేయాలని తాము న్యాయబద్ధంగా కోరుతున్నట్లు తెలిపారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ను త్వరలో కలసి తమ సమస్యను విన్నవించనున్నట్లు వెల్లడించారు.



## విజయవాడ యువకుడు సాయికృష్ణ అదృశ్యం కేసు.. శ్మశానవాటికలో పోలీసుల సోదాలు

విజయవాడలో తీవ్ర సంచలనం రేపుతున్న 23 ఏళ్ల యువకుడు సాయికృష్ణ అదృశ్యం కేసు.. మలుపులు తిరుగుతూ 'స్వర్గపురి' శ్మశానవాటికకు చేరింది. సాయికృష్ణను హత్య చేసి, అతని డెడ్‌బాడీని స్వర్గపురిలో గుట్టుచప్పుడు కాకుండా దహనం చేశారనే ఆరోపణల నేపథ్యంలో... పోలీసులు అక్కడకు వెళ్లి ఆధారాలు సేకరిస్తున్నారు.మే 23వ తేదీ రాత్రి 8 గంటలకు గుర్తు తెలియని మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకు వచ్చినట్టు సిబ్బంది చెబుతున్నారు. మే 24న వాటిని దహనం చేయడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. రికార్డుల్లో మృతదేహాలు 40 ఏళ్లకు పైబడిన వారివిగా ఉన్నాయి. సాయికృష్ణలాంటి యువకుడి దహన రికార్డులు ఎక్కడా లేవు.
ఈ వ్యవహారంలో స్వర్గపురిలో ఎలక్ట్రిక్ దహనాలు నిర్వహించే 'బాషా' అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐ పవన్ కిశోర్ అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని లీగల్ కాల్ డేటాను పరిశీలిస్తున్నారు.

# రెవిన్యూ శాఖ సేవలు ప్రజలకు అత్యంత కీలకం

**పారదర్శకత, సేవాభావమే రెవిన్యూ శాఖ లక్ష్యం**
**సాంకేతికతతో వేగవంతమైన సేవలందించాలి**
**జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్**

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 20,(రిపబ్లిక్ న్యూస్ ):**
రెవిన్యూ శాఖ సేవలు ప్రజలకు అత్యంత కీలకమని, ప్రజలతో నిత్యం మమేకమయ్యే రెవిన్యూ ఉద్యోగులు తమ సేవలను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి . విష్ణు చరణ్ పిలుపునిచ్చారు.
శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో రెవెన్యూ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రెవెన్యూ అధికారి మాలోల, పలువురు తాసిల్దార్లు కలెక్టరేట్ ఉద్యోగ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

**సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం**

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి రెవెన్యూ ఉద్యోగి తమ విధులను భాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందుకొని ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధిని ప్రజలకు అందించాలన్నారు. రెవిన్యూ శాఖలో విపత్తు నిర్వహణ ఒక భాగం అయ్యిందన్నారు. ప్రభుత్వం అప్పగించిన విధులను పారదర్శకంగా, సేవాభావమే లక్ష్యంగా పనిచేసి రెవెన్యూ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనదని, ప్రజలకు చిత్తశుద్ధితో తమ సేవలను అందించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అలాగే ప్రజా









సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సేవల నాణ్యత పెంపు కోసం సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం అని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలకు భూ సంబంధిత సేవలను మరింత సులభతరం చేయడం భూ వివాదాల పరిష్కారం రెవెన్యూ రికార్డుల డిజిటిలైజేషన్ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు వంటి అంశాలలో రెవెన్యూ శాఖ సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలో భూ రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు వారసత్వ మార్పిడి భూహక్కుల పరిరక్షణ ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు తక్షణ సహాయం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా రెవెన్యూ శాఖ తన కీలక పాత్రను పోషిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో రెవెన్యూ శాఖ అధికారులు ఇతర ఉద్యోగ సిబ్బంది పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించే విధంగా రెవెన్యూ ఉద్యోగుల సమన్వయంతో పనిచేసి ఈ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అలాగే ప్రతి ఫైలును పరిశీలించి ఖచ్చితంగా పరిష్కారం చూపాలన్నారు ప్రజలకు రెవెన్యూ శాఖపై విశ్వసనీయత కలిగే విధంగా సేవలందించాలని సూచించారు.

**రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ**

జిల్లా రెవెన్యూ అధికారి మాలోల మాట్లాడుతూ
రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు మరింతగా నాణ్యమైన సేవలు అందించే విధంగా అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. రెవెన్యూ శాఖ సాధించిన విజయాలను సమావేశంలో గుర్తు చేశారు. తమ బాధ్యతలను పారదర్శకంగా నిరరించాలన్నారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన సేవలు రెవెన్యూ శాఖ ద్వారా అందించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పరిపాలన సంస్కరణలు భూ పరిపాలనలో పారదర్శకత ప్రజలకు వేగవంతమైన సేవలందించుటలో రెవెన్యూ శాఖ సాధించిన విశిష్ట సేవలను పురస్కరించుకొని జిల్లాలో రెవెన్యూ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు చేరువైన పాలన భూ సంబంధిత సేవల సరళీకరణ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమల్లో రెవెన్యూ శాఖ పోషించిన కీలకపాత్రను డిఆర్ఓ వివరించారు. పరిపాలనలో రెవెన్యూ శాఖ కీలకమని ప్రస్తుత రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ వంటి కీలకమైన పనులను బాధ్యతగా ప్రజలకు సేవలు అందించి పారదర్శకంగా నిజాయితీగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఉద్యోగ బాధ్యతలతో పాటు ఆరోగ్యం కుటుంబ వ్యక్తిగత జీవితాలను కాపాడుకోవాలని డిఆర్ఓ సూచించారు.
చివరగా రెవిన్యూ శాఖలో సేవలందించి పదవి విరమణ చేసిన పలువురు అధికారులను ఉద్యోగ సిబ్బందిని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వారిని జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.అంతకుముందు కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి చివరి దశలో
జాయింట్ కలెక్టర్ ను ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి ఆనంద్ రామ్మోహన్ పద్మావతి, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు దివాకర్ బాబు రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అగ్రహారం నిర్వాసితులకు పునరావాసం

## అన్ని విధాల ఆదుకుంటాం- గ్రామ సభలో ఆర్డీవో హామీ,

**రైల్వే కోడూరు జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**
ముగ్గురాయికి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మంగంపేట గనుల విస్తరణ నేపథ్యంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ సట్ట ప్రకారం ఆర్ఆర్ టు సెంటర్ అగ్రహారం గ్రామస్తులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయమైన పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మండల తాసిల్దార్ ఆకుల సిద్దేశ్వర రావు అన్నారు ఆర్ఆర్ ఫైవ్ లో ప్రభుత్వం 72 ఎకరాల భూమిని సేకరించిందని అక్కడ అగ్రహారం నిర్వాసితులకు కుటుంబానికి ఐదు సెంట్లు చొప్పున ఇంటి స్థలం మంజూరు చేయడం జరుగుతుందని సిద్దేశ్వర రావు అన్నారు పశువులపాక తోపుడు బండ్లు చిన్న చిన్న వ్యాపారాలు ఉన్నటువంటి ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకుంటుందని తెలియజేశారు, అనంతరం ఆర్డిఓ రామ్మోహన్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గతంలో నేను తాసిల్దారుగా పనిచేయడం వలన ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు నాకు తెలుసని జిల్లాల మార్పుల వలన మీకు రావలసిన ప్యాకేజీలు ఆలస్యం అయ్యాయని ఇప్పుడు ఆ కష్టాలు తీరాయని జూలై చివరినాటికి మీ అందరిని అన్ని విధాల ఆదుకుని మీకు పునరావాసం ఆర్ఆర్ 5 లో కల్పించడం జరుగుతుందని గ్రామ సభలో ఆర్డిఓ రామ్మోహన్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని తెలియజేశారు









చనిపోయిన వారికి కూడా సరైన పత్రాలు తాసిల్దార్ కు అందజేయాలని తద్వారా వారిని కూడా ఆదుకుంటామని తెలియజేశారు,కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా ఎలాంటి సమస్యలు ఉన్న ఫస్ట్ ప్రయారిటీ వారికి ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు ఈ నేపథ్యంలో స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు ఆర్ఆర్ 5లో నిర్వాసితులకు పునరావాసం పునరుపాది కల్పించడంతోపాటు అక్కడ ప్రభుత్వ పక్క గృహాలను మంజూరు చేయిస్తానని గ్రామస్తులకు స్పష్టం చేశారు. అగ్రహారం లో నిర్వహించిన నిర్వాసితుల పునరావాస గ్రామ సభ కు తిరుపతి జిల్లా ఆర్డిఓ రామ్మోహన్ సభా అధ్యక్షత వహించగా ఆయనతో కలిసి ముఖ్య అతిథిగా రూపానంద రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వాసితుల పునరావాసం కోసం సేకరించిన 72 ఎకరాల భూమి, అక్కడ కల్పించబోయే మౌలిక వసతులపై అధికారులతో కలిసి గ్రామస్తులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు అనంతరం ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలో రూపానందరెడ్డిని, ఆర్డీవో రామ్మోహన్‌ను స్థానిక అధికారులు, కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు.

ఈ సమావేశంలో గ్రామస్తుల తరపున మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఎలాంటి అనుమానాలు, వ్యత్యాసాలు లేకుండా పునరావాస ప్యాకేజీని సమానంగా పంపిణీ చేయాలని కోరారు. 16 సంవత్సరాలుగా గనుల్లో బ్లాస్టింగ్ జరుగుతుంటే ప్రాణాలు అరచేతుల పెట్టుకుని పునరావాసం కోసం ఎదురుచూస్తున్నామని నిజాయితీ కలిగిన అధికారులు రాజకీయ నాయకులు ఈ సభ ను అలంకరించారని ఈ సందర్భంగా మా కోరికను మన్నించి జూలై చివరినాటికి ఇక్కడి నుండి అన్ని విధాల మమ్మల్ని ఆదుకొని తరలించాలని వారిని కోరారు అలాగే దురదృష్టవశాత్తూ మరణించిన బాధితుల కుటుంబాలకు కూడా ఈ ప్యాకేజీ వర్తింపజేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన రూపానందరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్ సానుకూలంగా స్పందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతాయని, ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. సేకరించిన 72 ఎకరాల భూమిలో నిర్వాసితులందరికీ ప్రభుత్వ నిధులతో పక్కా గృహాలను నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు రూపానందరెడ్డిని ప్రత్యేకంగా అభ్యర్థించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ఉన్నతాధికారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన మంజూరు చేయిస్తానని మాట ఇచ్చారు.

కార్యక్రమంలో సీపీఓ గోపీనాథ్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ దీప్తి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, గనుల శాఖ అధికారి నారాయణ, కల్ల చలపతి, స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, సిఐటియు నాయకులు పుల్లగంటి రమణయ్య రెవెన్యూ సిబ్బంది మరియు మంగంపేట గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

### శ్రీరాముడి చిత్రంపై చెప్పు -నిరసనగా ఢాకాలో హిందువుల భారీ ర్యాలీ

**ఢాకా,జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, అతివాదుల నుంచి బెదిరింపులు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు అవమానకర చర్యలకు దిగడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఢాకాలో వేల మంది హిందువులు నిరసనకు దిగారు. పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ అని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి తరలి రావాలన్న హిందూ మహాజ్యోత్ సంస్థ పిలుపు మేరకు శుక్రవారం సామాన్య ప్రజలు, ఇతర హిందూ సంఘాలు షహబాగ్ కూడలికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకూ ర్యాలీగా వెళ్లారు. ప్రెస్‌క్లబ్ ముందు భారీ మానవహారంతో నిరసన తెలిపారు. మరికొంత మంది ఢాకా రిపోర్టర్స్ యూనిటీ భవనం ముందు నిరసన చేపట్టారు. రంగపూర్‌లో నిరసన తెలిపిన వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైనారిటీలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని నిరసనకారులు ఆరోపించారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మ జన్మదినోత్సవం

### ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు, పవన్ శుభాకాంక్షలు


**అమరావతి,జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**
శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రపతికి రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బర్త్ డే విషెస్ తెలియజేశారు. దేశానికి ద్రౌపది ముర్ము అందిస్తున్న సేవల్లో విజయం సాధించాలని సీఎం ఆకాంక్షించగా, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రాష్ట్రపతి ముర్ము నిజమైన స్ఫూర్తిదాయకమని పవన్ అన్నారు. 'భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జన్మదిన శుభాకాంక్షలు. ఆమె జీవితం, ప్రజాసేవ దేశవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ద్రౌపది ముర్ము మంచి ఆరోగ్యంతో ఉండాలని, దేశానికి ఆమె అందిస్తున్న గొప్ప సేవల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ చంద్రబాబు పోస్ట్ చేశారు. 'రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నగర్ పంచాయతీ కౌన్సిలర్‌గా సేవలందించడం నుంచి భారతదేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగే వరకూ.. ఆమె సాగించిన అద్భుత ప్రయాణం, ప్రజాసేవకులు, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ నిజమైన స్ఫూర్తిదాయకం. ఇది అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్య బలానికి, అంకితభావంతో కూడిన ప్రజాసేవ శక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. దేశ సేవలో ఆమెకు మంచి ఆరోగ్యం, దృఢత్వం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని జగన్నాథ స్వామిని ప్రార్థిస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.


# సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ

# యోగా...!



**నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం**





**జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.**
మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్ళుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆధ్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది.ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం.

యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్చేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరనవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరిం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరక్ష్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున – స్థిరసుఖ మాసనమ్– అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో – సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్చ – ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము – ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ – ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.–ధవుతి, నేతి, వస్తి, నొలి, త్రటకం, తధా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి – అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ డానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

**స్వచ్ఛ ఆంధ్రతో పరిశుభ్రత.. యోగాంధ్రతో ఆరోగ్యవంతమైన సమాజం**

**పరిశుభ్రమైన పరిసరాలు - ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరం**

**జిల్లావ్యాప్తంగా 4,600 కేంద్రాల్లో యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు**

**యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి : కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల బ్యూరో, జూన్ 20 (రిపబ్లిక్ న్యూస్ ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసరాలు, ప్రధాన వీధులు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వయంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో ప్రారంభమైన "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం జిల్లాలో నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ప్రజలకు సూచించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని కాలువలు పూడికతో నిండిపోవడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించి, వాటి పరిష్కారానికి మున్సిపల్ మరియు రైల్వే శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలువల పూడికతీత పనులు, అవసరమైన చోట్ల స్లాబ్‌ల ఏర్పాటు, అదనపు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు ద్వారా పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు. నంద్యాల మున్సిపాలిటీలో గత నాలుగు వారాలుగా చేపడుతున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ద్వారా పేరుకుపోయిన పాత చెత్త (లెగసీ వేస్ట్)ను పూర్తిగా తొలగించి, వ్యర్థాలను వర్గీకరించి కంపోస్టింగ్ యూనిట్లు, బయోడైజెస్టర్ ప్లాంట్లకు తరలించి సేంద్రియ ఎరువులుగా మార్చే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నంద్యాలను మరింత పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించడంతో పాటు రోడ్లపై చెత్త వేయకుండా పరిశుభ్రతను జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత కార్యక్రమాలు ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు.



### యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి

అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించనున్న యోగాంధ్ర–2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా సుమారు 4,600 కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. గ్రామాలు, వార్డులు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ఒకేసారి యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటికే సుమారు నాలుగు లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకోవడం విశేషమని పేర్కొన్నారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే అద్భుత సాధనమని, దీనిని కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన యోగా సంప్రదాయం నేడు అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోందని, ఆరోగ్యవంతమైన మరియు ఆనందకరమైన సమాజ నిర్మాణానికి యోగా సమర్థవంతమైన మార్గమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించనున్న యోగాంధ్ర–2026 కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

**పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీలు వేదికలు : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**







**నంద్యాల బ్యూరో, జూన్ 20( రిపబ్లిక్ న్యూస్):** చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల పట్టణం బొగ్గులైన్ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి, ప్రభుత్వం అందించిన సదుపాయాల వినియోగం, చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ విధానాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బొగ్గులైన్ అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులను పాఠశాల విద్యకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. చిన్నారులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా ఎదగాలంటే వారిని క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1663 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించబడుతున్నాయని, ఈ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించేందుకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం ప్రత్యేకంగా యుటెన్సిల్స్ కిట్‌తో పాటు ఇండక్షన్ స్టవ్‌లను అందించిందన్నారు. ఇంధన పొదుపు, సురక్షిత వంట విధానాలను ప్రోత్సహించే దిశగా ఇండక్షన్ స్టవ్‌ల వినియోగాన్ని అన్ని కేంద్రాల్లో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పాలు, గుడ్లు, పోషకవిలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తున్నామని సిబ్బంది కలెక్టర్ కు నివేదించారు. అంతేకాకుండా ఆటలు, పాటలు, ప్రాథమిక అభ్యాస కార్యక్రమాల ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక వికాసాన్ని పెంపొందిస్తూ, ప్రాథమిక విద్యకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ కు వివరించారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట..

**నంద్యాల జిల్లాలో 2.06 లక్షల మంది రైతులకు రూ.139.41 కోట్ల ఆర్థిక సహాయం**

**అన్నదాతకు అండగా ప్రభుత్వం.. ప్రతి అర్హ రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక భరోసా**

**వ్యవసాయాభివృద్ధే లక్ష్యం..**

**రైతుల ఖాతాల్లో భారీగా నిధుల జమ**

**అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌తో రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత**

**రైతు సంక్షేమం, భూసార పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**





**నంద్యాల బ్యూరో, జూన్ 20 (రిపబ్లిక్ న్యూస్):** రైతుల ఆర్థిక స్థిరత్వం, వ్యవసాయ రంగాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్" పథకం ద్వారా నంద్యాల జిల్లాలో అర్హులైన రైతులకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నిర్వహించిన "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్" పథకం కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 2,06,052 మంది రైతులకు రూ. 139.41 కోట్ల ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 103.03 కోట్లు, కేంద్ర ప్రభుత్వం తరఫున రూ. 36.39 కోట్లు అందించబడినట్లు పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం మూడు విడతలుగా అందజేస్తున్నట్లు వివరించారు. తొలి, రెండో విడతల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 5 వేలు చొప్పున మొత్తం రూ. 7 వేల చొప్పున, మూడో విడతలో కేంద్రం నుంచి రూ. 2 వేలు, రాష్ట్రం నుంచి రూ. 4 వేలు కలిపి రూ. 6 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 42,981 మంది రైతులకు రూ. 29.10 కోట్లు, బనగానపల్లె నియోజకవర్గంలోని 40,664 మంది రైతులకు రూ. 27.41 కోట్లు, నంద్యాల నియోజకవర్గంలోని 36,734 మంది రైతులకు రూ. 24.94 కోట్లు అందించగా, డోన్ నియోజకవర్గంలోని 35,011 మంది రైతులకు రూ. 23.40 కోట్లు, శ్రీశైలం నియోజకవర్గంలోని 25,018 మంది రైతులకు రూ. 17.06 కోట్లు, నందికొట్కూరు నియోజకవర్గంలోని 12,953 మంది రైతులకు రూ. 8.79 కోట్లు, పాణ్యం నియోజకవర్గంలోని 12,691 మంది రైతులకు రూ. 8.72 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పాదకత పెరగాలంటే భూసారాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం యూరియా, డి.ఎ.పి., కాంప్లెక్స్ ఎరువులను భారీ సబ్సిడీపై అందిస్తున్నప్పటికీ, వాటిని మితిమీరిన స్థాయిలో వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గే ప్రమాదం ఉందన్నారు. భూముల్లో జింక్, సూక్ష్మపోషకాలు, కర్బన శాతం లోపిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారని, రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా భూసారాన్ని పరిరక్షించాలని సూచించారు. పోలూరు గ్రామంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే రూ. 5 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. పాఠశాల మైదానం లెవెలింగ్ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని సీసీ రోడ్లపై నీరు నిలిచే సమస్యను సాంకేతిక నిపుణులతో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే పొలాల రహదారుల నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్‌లో జూలై 1 నుంచి అమల్లోకి రానున్న మార్పుల అనంతరం అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం, సహకారం ఉంటేనే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. పోలూరు గ్రామ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, నీటి పారుదల, పాఠశాల మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువస్తే నిధుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

# నీట్-యూజీ 2026 పునఃపరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ సాయి ప్రసాద్ వీడియో సమీక్ష**



**నంద్యాల బ్యూరో, జూన్ 20( రిపబ్లిక్ న్యూస్):** 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)–2026 పునఃపరీక్ష ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలెక్టర్ ఛాంబర్ నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 65,790 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, వారి కోసం 185 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల రవాణా మరియు భద్రపరచడంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీటీవీ నిఘాలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు అవసరమైతే ఇంటర్నెట్ సేవలను నియంత్రించాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కల్పించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని ఫోటోకాపీ కేంద్రాలు, సైబర్ కేఫ్‌లు, కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో పేపర్ లీకేజీ వంటి తప్పుడు ప్రచారాలు, వదంతులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీ గుర్తింపు కార్డులు లేదా ఇతర అక్రమ మార్గాల ద్వారా పరీక్ష రాసేందుకు ప్రయత్నించే వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ సాయి ప్రసాద్ స్పష్టం చేశారు.

# అరుదైన వ్యాధిగ్రస్తులకు సర్కార్ అండ

**ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి**




**అమరావతి,జూన్ 20 రిపబ్లిక్ న్యూస్.** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుదైన వ్యాధిగ్రస్థులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ప్రత్యేక పాలసీ రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 'నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్–2021'కు అనుగుణంగా నూతన పాలసీని త్వరగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య సేవలు, బాధితులకు తోడ్పాటును అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ చెప్పారు. అలాగే మూడు రిఫరల్ కేంద్రాలు, ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ రిజిస్ట్రీ ఏర్పాటు, వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు పాలసీ తయారీపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సత్యకుమార్ తెలిపారు. మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని పాలసీ తయారీకి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. అతి త్వరలో పాలసీని రూపొందించి అరుదైన వ్యాధిగ్రస్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకర సమాజానికి పునాది**

**జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్**







**నంద్యాల బ్యూరో, జూన్ 20 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని ప్రతి ప్రభుత్వ శాఖ సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డీఆర్ఓ పాల్గొని అధికారులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణ, కార్యాలయ పరిసరాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలను పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణ లక్ష్యంతో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాలు, నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని తగ్గించి, చెత్తను తడి – పొడి వ్యర్థాలుగా వేరు చేసి నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా మారడంతో పాటు ప్రజారోగ్యం మెరుగుపడుతుందని, వ్యాధుల నివారణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com